


మన్యం కేఫ్ ప్రారంభం

ప్రజాశక్తి - పార్వతీపురంటౌన్

మన్యం జిల్లాలో పండించే ఉత్పత్తులను ప్రోత్సహించాలని స్థానిక ఎమ్మెల్యే బోనెల విజయ చంద్ర అన్నారు. శనివారం స్థానిక ఐటిడిఎ పెట్రోల్ బంక్ వద్ద డిఆర్‌డిఎ ఆధ్వర్యంలో జిల్లా మహిళా సమాఖ్య సంఘం ఏర్పాటు చేసిన కేఫ్‌ను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ మన్యం కేఫ్ ద్వారా స్థానిక గిరిజన మహిళలకు ఉపాధి అవకాశాలు కల్పించబడుతున్నాయని, స్థానిక పంటలు, ఆహార పదార్థాలను ప్రోత్సహించడం ద్వారా గ్రామీణ ఆర్థిక వ్యవస్థకు బలం చేకూరుతుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ సి.యశ్వంత్ కుమార్ రెడ్డి, డిఆర్‌డిఎ పీడీ ఎం.సుధారాణి, కొప్పల వెలమ డైరెక్టర్ గొట్టపు వెంకట నాయుడు, గిరిజన సంఘ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

మొక్క మొలిచిన జొన్న

పీకల్లోతు కష్టాల్లో రైతులు

కొనే నాథుడు లేక రోడ్లపైనే నిల్వ

వరుస తుపాన్లతో తీవ్ర నష్టం

ప్రజాశక్తి - పార్వతీపురం

వరుస తుపాన్లతో మొక్కజొన్న గింజలు మొక్క మొలిచిన పరిస్థితి ఏర్పడింది. భారీ వర్షాలు జొన్న పండించిన రైతులను కోలుకోలేని విధంగా దెబ్బ తీశాయి. గిట్టుబాటు ధర కోసం ఎదురు చూస్తూ ఎండకు ఎండి వానకు తడుస్తూ మొక్కజొన్న గింజలు తడిసిపోవడంతో మొక్క మొలిచాయి. గతంలో ఎన్నడూ లేని విధంగా ఈ ఏడాది మొక్కజొన్న పండించిన రైతులు తీవ్రంగా నష్టపోయారు. పండిన పంట నిల్వ చేసుకొనే సామర్ధ్యం లేక మార్కెట్‌లో ఉన్న తక్కువ ధరకు అమ్మలేక సతమతమవుతున్న తరుణంలో అకాల వర్షాలు కోలుకోలేని దెబ్బ తీశాయి. రోడ్లపైనే ఆరబెట్టి వర్షం వస్తే టార్పాలిన్‌తో కప్పడం వల్ల రైతులకు కంటిమీద కునుకులేకుండా పోయింది. ప్రభుత్వం క్వింటాకు మద్దతు ధర రూ.2400లుగా ప్రకటించింది. కానీ రెండు వేల రూపాయలకు కూడా వ్యాపారులు కొనుగోలు చేసే పరిస్థితి లేదు. జొన్న గింజల నాణ్యత లేదన్న సాకుతో వ్యాపారులు రూ.1500 నుంచి రూ.1900 వరకు మాత్రమే కొనుగోలు చేస్తున్నారు. దీంతో రైతులు ఒక క్వింటాకు రూ.500 వరకు నష్టపోవాల్సి వస్తోంది. గత కొన్నేళ్లుగా ప్రభుత్వం మొక్కజొన్న కొనుగోలు చేయకుండా చేతులెత్తేసింది. ఎపి మార్క్‌ఫెడ్ ద్వారా మొక్కజొన్న కొనుగోలు చేయాల్సి ఉంది. రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల మొంథా తుఫాన్ ప్రభావం వల్ల నష్టపోయిన వరి, పత్తి పంటలకు నష్టపరిహారం చెల్లించేందుకు రంగం సిద్ధం చేసింది. కానీ మొక్కజొన్న పండించిన రైతులను పట్టించుకోకుండా వదిలేసింది. జిల్లాలో అధిక విస్తీర్ణంలో మొక్కజొన్న సాగు జరుగుతోంది. సుమారు 17వేల ఎకరాల్లో సాగు చేస్తున్నారు. పాచిపెంట, సాలూరు, మక్కువ, పార్వతీపురం, కొమరాడ, కురుపాం, గుమ్మలక్ష్మీపురం, పాలకొండ, వీరఘట్టం మండలాల్లో ఈ పంట దిగుబడి ఆశాజనకంగా ఉంది. అయితే ప్రభుత్వం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయకపోవడంతో రైతులు నష్టాల్లో కూరుకుపోయే పరిస్థితి నెలకొంది. పండించడానికి పెట్టిన మదుపు డబ్బులు కూడా చేతికి దక్కడం లేదు.



మొలకెత్తిన మొక్కజొన్నలు



మొక్కజొన్న పంటను పరిశీలిస్తున్న రైతు సంఘం నాయకులు

జొన్న రైతులకు నష్టపరిహారం ఇవ్వాలి

ఎపి రైతు, కౌలు రైతు సంఘాల జిల్లా కార్యదర్శులు బంటు దాసు, రమణమూర్తి

మొంథా తుఫాన్ కారణంగా నష్టపోయిన మొక్కజొన్న గిరిజన రైతులకు నష్టపరిహారం వెంటనే మంజూరు చేయాలని ఎపి రైతు, కౌలు రైతు సంఘాల జిల్లా కార్యదర్శులు బంటు దాసు, రెడ్డి రమణమూర్తి డిమాండ్ చేశారు. శనివారం వారు పార్వతీపురం మండలం డోకిశిల పంచాయితీ పరిధిలో గల జోగుదారుమెట్టవలస, గెంజిగెడ్డ, ములక్కాయవలస, డెప్పివలస గిరిజన గ్రామాల రైతులు నష్టపోయిన జొన్న పంట పొలాలను పరిశీలించారు. మొంథా తుపానుకు ముందు తర్వాత ఉన్న పరిస్థితులను గిరిజన రైతులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం బంటు దాసు మాట్లాడుతూ మండల పరిధిలో పన్నెండు గిరిజన గ్రామాలు ఉన్నాయని, అత్యధిక గ్రామాలు వరితో పాటు జొన్న పంటలు కూడా వేశారని, పంట దిగుబడికి చేరే సమయానికి తుఫాన్ వల్ల తీవ్రమైన నష్టం వాటిల్లిందన్నారు. పంట సకాలంలో ప్రభుత్వం కొనుగోలు చేయకపోవడం వల్ల నష్టం జరిగిందని ఆందోళన వ్యక్తం చేశారు. 12 గ్రామాల్లో సుమారుగా రైతులు వేసిన 200 ఎకరాల పంట ఆరు వేల క్వింటాళ్ల వరకు దిగుబడి వచ్చిందన్నారు. క్వింటా రూ.2400 చొప్పున ప్రభుత్వం ధర నిర్ణయించినా కొనే నాథుడు లేరన్నారు. దళారీ వ్యాపారుల వల్ల రూ.600 వరకు నష్టం జరుగుతోందని ఈ లెక్కన సుమారుగా రూ.30 లక్షల వరకు గిరిజన రైతులు నష్టపోతున్నారని తెలిపారు. అహర్నిశలు శ్రమ పడుతున్న గిరిజనుల కష్టం అమాయకత్వం వల్ల దళారీల చేతుల్లోకి పోతోందన్నారు. జొన్న రైతులకు మార్క్ ఫెడ్ ద్వారా మద్దతు ధర ప్రకారం కొనుగోలు చేపట్టి న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. తుఫాను వల్ల నష్టపోయిన ప్రతి రైతును ఆదుకుంటామని కూటమి ప్రభుత్వం చెపుతోందని, ఆచరణలో మాత్రం అమలు చేయడం లేదని విమర్శించారు. తుఫాన్ కారణంగా నష్టపోయిన మొక్కజొన్న పంటలను అధికారులు, ప్రజాప్రతినిధులు పరిశీలించాలని, తడిసిన, మొలకెత్తిన జొన్నలను ప్రభుత్వం ప్రకటించిన ధరకు కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. లేకుంటే భవిష్యత్తులో పెద్ద ఎత్తున రైతులతో ఆందోళన చేపడతామని హెచ్చరించారు. కార్యక్రమంలో రైతు సంఘం నాయకులు బేత నాగభూషణరావు, తాడంగి లక్ష్మయ్య, తాడంగి రాజేష్, బికిను, ఉదయ్ తదితరులు పాల్గొన్నారు.

పర్యాటకాభివృద్ధికి కృషి : మంత్రి

ప్రజాశక్తి - సీతంపేట

మన్యం జిల్లాలో గల ఏజెన్సీ ప్రాంతాల్లో పర్యాటక అభివృద్ధికి కృషి చేస్తామని, అందుకు కూటమి ప్రభుత్వం ముందడుగు వేస్తుందని గిరిజన సంక్షేమ శాఖ మంత్రి జి.సంధ్యారాణి అన్నారు. శనివారం స్థానిక ఎన్టీఆర్ అడ్వెంచర్ పార్క్ వద్ద హాట్ హెయిర్ బెలూన్ ప్రారంభించారు. అంతకుముందు మెట్టుగూడ జలపాతాన్ని సందర్శించి ఫొటోస్ సెషన్ ప్రారంభించారు అక్కడే మొక్కలు నాటే కార్యక్రమంలో పాల్గొన్నారు. అక్కడి నుంచి పార్క్ వరకు సాగిన బైక్ ర్యాలీని జెండా ఊపి ప్రారంభించారు. సీతంపేట బస్టాండ్ నుంచి పార్కు వరకు జన జాతీయ గౌరవ దివాస్ కార్యక్రమం నిర్వహించారు. అనంతరం ఎన్టీఆర్ అడ్వెంచర్ పార్క్ వద్ద ఫుడ్‌కోర్ట్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో మంత్రి మాట్లాడుతూ అరకు పార్లమెంట్లో అల్లూరి, మన్యం జిల్లాల పర్యాటక ప్రాంతాలను మరింత అభివృద్ధి చేస్తామన్నారు. గిరిజన సాంప్రదాయాలు, ఆచారాల ప్రకారం పర్యాటక ప్రాంతాలు, జలపాతాలు అభివృద్ధి చేస్తామని అన్నారు. ఇప్పటికే కూటమి ప్రభుత్వం పర్యాటక రంగానికి పరుగులు తీయిస్తుందన్నారు. తద్వారా గిరిజన యువతకు ఉపాధి అవకాశాలు ఉంటాయని చెప్పారు. ఇప్పటికే కూటమి ప్రభుత్వం రాష్ట్రంలో 16వేల టీచర్, 6వేలు కానిస్టేబుల్ పోస్టులు భర్తీ చేసిందన్నారు. తల్లికి వందనం, ఉచిత గ్యాస్, అన్నదాత సుఖీభవ, మహిళలకు ఉచిత బస్సు వంటి సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టిందని వివరించారు.

అనంతరం బిర్సాముండా 150 జయంతి సందర్భంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా జరిగిన సభలో మంత్రి మాట్లాడుతూ బిర్సా ముండా జయంతిని జిల్లాలో తొలిసారిగా జరుపుకోవడం ఒక కొత్త చరిత్ర అని అభివర్ణించారు. జాతి కోసం, ప్రజల కోసం, పేదవాళ్ల కోసం ఆయన ఎంతో కష్టపడి గిరిజన జాతిని అంత రించకుండా చేసిన మహానుభావుడు బిర్సా ముండా అని కొనియాడారు. మనం పుట్టిన దేశాన్ని, మాతృ భాషను, జాతిని గౌరవించుకోవాలని, ఆ విధంగానే గిరిజన జాతిని బిర్సా ముండా లాంటి నాయకులను గౌరవించుకోవాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. స్థానిక ఎమ్మెల్యే నిమ్మక జయకృష్ణ మాట్లాడుతూ గిరిజనులు అడవుల్లో ఉన్నప్పటికీ కూడా ఇవాళ మంచి విద్య, వైద్యం, ఉపాధి, ఉద్యోగాలు అన్నీ కూడా లభించేలా ప్రభుత్వం ఆలోచన చేస్తుందన్నారు. ఈ సందర్భంగా జరిగిన సభలో పలువురు నాయకులు, అధికారులు గిరిజన ప్రాంతాల అభివృద్ధికి బిర్సా ముండా వారసత్వాన్ని గౌరవించాల్సిన ఆవశ్యకతను చెప్పారు. కార్యక్రమంలో కలెక్టర్ ప్రభాకర్ రెడ్డి, జెసి యశ్వంత్ కుమార్ రెడ్డి, పాలకొండ ఎమ్మెల్యే నిమ్మక జయకృష్ణ, సబ్‌కలెక్టర్ పవర్ స్వప్నిల్ జగన్నాథ్, ఎఎంసి చైర్మన్ సంధ్యారాణి, పాలకొండ నియోజకవర్గ టిడిపి ఇన్చార్జి పడాల భూదేవి, ఎపిఒ గణేష్, డిడి అన్నదొర, ఇఇ రమాదేవి, డిప్యూటీ డిఇఇ రామ్మోహన్ రావు, డిఇ నాగభూషణం, సీతంపేట, భామిని, పాలకొండ మండలాల టిడిపి అధ్యక్షులు రవి నాయుడు రామినాయుడు, పవన్ ప్రసాదు తదితరులు పాల్గొన్నారు.



హాట్ బెలూన్‌లో విహరిస్తున్న మంత్రి, ఎమ్మెల్యే



బైకు ర్యాలీని ప్రారంభిస్తున్న మంత్రి సంధ్యారాణి



పెదపదంలో నేలకొరిగిన వరిపంటను పరిశీలిస్తున్న రాజన్నదొర

తుపానుకు నష్టపోయిన రైతులను ఆదుకోవాలి

మాజీ డిప్యూటీ సిఎం రాజన్నదొర

ప్రజాశక్తి - సాలూరు

మొంథా తుఫాన్ సృష్టించిన బీభత్సం నియోజకవర్గంలోని అన్నదాతలను నిండా ముంచిందని, కావున నష్టపోయిన రైతులను ఆదుకోవాలని మాజీ ఉప ముఖ్యమంత్రి పీడిక రాజన్నదొర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మండలంలోని పెదపదంలో నేలకొరిగిన వరి పంట పొలాలను వైసిపి నాయకులతో కలిసి శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ మండలంలో వరి పంట పూర్తిగా దెబ్బతిని, ధాన్యం రంగు మారే ప్రమాదం ఏర్పడిందన్నారు. దీంతో పెట్టుబడి కూడా దక్కే పరిస్థితి లేదన్నారు. తుఫాన్ కారణంగా కురిసిన భారీ వర్షాలు, ఈదురు గాలులకు పొట్ట దశలో ఉన్న వరిచేలన్నీ నేలకొరిగాయని, రోజుల తరబడి నీటిలోనే ఉండడంతో ధాన్యం రంగు మారి, మొలకెత్తే దశకు చేరుకుందని, మార్కెట్లో దీనికి గిట్టుబాటు ధర దక్కే అవకాశం లేకపోవడంతో రైతులు తీవ్రంగా నష్టపోనున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. ఇటువంటి పరిస్థితుల్లో రైతులను ప్రభుత్వమే ఆదుకోవాలని డిమాండ్ చేశారు. వరి పంటను కోల్పోయిన రైతులకు తక్షణమే ఇన్‌పుట్ సబ్సిడీ కింద నష్టపరిహారం అందజేయాలన్నారు. నేలకొరిగి నీటిలో నాని రంగు మారిన ధాన్యాన్ని ప్రభుత్వం మద్దతు ధరకు కొనుగోలు చేయాలని, లేకుంటే రైతులు దళారులకు తక్కువ ధరకు అమ్ముకోవాల్సిన దుస్థితి ఏర్పడుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. అధికారులు కేవలం అంచనాలు వేసి చేతులు దులుపుకోకుండా, నష్టపోయిన ప్రతి రైతుకు న్యాయం జరిగేలా చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో వైస్ ఎంపిపి రెడ్డి సురేష్, సర్పంచ్ సుకన్య, రైతులు పాల్గొన్నారు.

స్వాతంత్ర్య పోరాటంలో గిరిజనుల పాత్ర కీలకం

బిర్సా ముండా జయంతిసభలో ప్రభుత్వ విప్, జెసి

ప్రజాశక్తి - పార్వతీపురం

స్వాతంత్ర్య పోరాటంలో గిరిజన నాయకులు, ప్రజలదే కీలక పాత్రని ప్రభుత్వ విప్, కురుపాం ఎమ్మెల్యే తోయక జగదీశ్వరి అన్నారు. ఈనెల 1నుంచి 15 వరకు జరిగే జన్ జాతీయ గౌరవ దినోత్సవం కార్యక్రమంలో స్వతంత్ర సమరయోధుడు బిర్సా ముండా 150వ జయంతి వేడుకలను శనివారం ఐటిడిఎ ఆధ్వర్యంలో గిరిమిత్ర భవనంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రభుత్వ విప్ మాట్లాడుతూ దేశ స్వాతంత్రం కోసం బ్రిటిష్ వారితో పోరాటాలు చేసిన వారిలో మన గిరిజనులుండటం మనకెంతో గర్వకారణమన్నారు. గిరిజనులు స్వేచ్ఛగా, స్వతంత్రంగా ఉండడానికి ముఖ్య కారణం బిర్సా ముండా అని తెలిపారు. గిరిజనుల కోసం ఆయన చేసిన పోరాటమే ఈనాడు గిరిజన జాతి గుర్తింపు కలిగి జీవిస్తోందని పేర్కొన్నారు. ప్రతి మండలంలోనూ బిర్సా ముండా జయంతి వేడుకలను నిర్వహించాల్సిన అవసరం ఉందన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు గిరిజన సంక్షేమానికి కృషి చేస్తున్నాయని పేర్కొన్నారు. పార్వతీపురం ఎమ్మెల్యే బోనెల విజయ చంద్ర మాట్లాడుతూ మానవజాతి మనుగడలో మూలం ఆదివాసీలేనని అన్నారు. గిరిజనులను ఏకతాటిపై తీసుకువచ్చి వారి మానప్రాణాలను కాపాడిన గొప్ప నాయకుడు బిర్సా ముండా అని కొనియాడారు. బిర్సా ముండా ఆత్మస్ఫూర్తి దిశగా గిరిజనుల ఆర్థిక, సామాజిక స్థితి మెరుగుకు మరింత కృషి చేస్తామని తెలిపారు. జాయింట్ కలెక్టర్, ఇన్‌ఛార్జి ఐటిడిఎ పిఒ సి.యశ్వంత్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ బిర్సా ముండా భారత స్వాతంత్ర్య పోరాట చరిత్రలో ఒక స్ఫూర్తిదాయకమైన నాయకుడని కొనియాడారు. గిరిజనుల హక్కుల కోసం ఆయన చేసిన పోరాటం, త్యాగం మనందరికీ ఆదర్శప్రాయమైందని, యువత ఆయన ఆత్మస్ఫూర్తిని అవలంబించి సమాజ అభివృద్ధికి కృషి చేయాలన్నారు. జిల్లాలో అనుకోని సంఘటన జరగడం బాధాకరమని, విద్యార్థుల తల్లిదండ్రులు సహకారం చాలా గొప్పదని అన్నారు. తొలుత ప్రభుత్వ విప్, ఎమ్మెల్యేలు, జాయింట్ కలెక్టర్, గిరిజన సంఘ నేతలు బిర్సా ముండా చిత్రపటానికి పుష్పాంజలి సమర్పించారు. అంతకుముందు స్థానిక ఆర్‌టిసి కాంప్లెక్స్ నుండి ఐటిడిఎ కార్యాలయం వరకూ పెద్ద ఎత్తున ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ ధర్మ చంద్రా రెడ్డి, రాష్ట్ర గిరిజన సంక్షేమ సంస్థ సభ్యులు ఎం.తేజోవతి, కొప్పల వెలమ డైరెక్టర్ గొట్టాపు వెంకట నాయుడు, గిరిజన సంఘ నాయకులు, విద్యార్థులు, స్థానికులు తదితరులు పాల్గొన్నారు.



సభలో మాట్లాడుతున్న ప్రభుత్వ విప్ జగదీశ్వరి



మాట్లాడుతున్న సిఐటియు జిల్లా అధ్యక్షులు దావాల రమణారావు

3న గ్రీన్ అంబాసిడర్ల నిరసన

ప్రజాశక్తి - పాలకొండ

పంచాయతీ పారిశుధ్య కార్మికులు, గ్రీన్ అంబాసిడర్ల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ఈనెల 3న జిల్లా పంచాయతీ అధికారి కార్యాలయం వద్ద నిరసన చేపట్టనున్నట్టు సిఐటియు జిల్లా అధ్యక్షులు దావాల రమణారావు తెలిపారు. శనివారం స్థానిక ఆర్‌టిసి కాంప్లెక్స్ వద్ద సిఐటియు జిల్లా కమిటీ సభ్యులు కె.రాము అధ్యక్షతన గ్రీన్ అంబాసిడర్లతో సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చాలీచాలని జీతాలతో కుటుంబాలు అర్ధాకలితో గడుపుతున్నారని, దీనికి తోడు ప్రతినెలా సక్రమంగా జీతాలు చెల్లించడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. మున్సిపల్ కార్మికులకు చెల్లిస్తున్న విధంగా పంచాయతీ, గ్రీన్ అంబాసిడర్ కార్మికులకు నెలకు రూ.21వేలు జీతం చెల్లించాలని, 132 ,142, 680 జీవోలు అమలు చేయాలని, అమలు చేయని అధికారులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కోరారు. టెండర్ విషయంలో హైకోర్టు ఇచ్చిన తీర్పును కచ్చితంగా అమలు చేయాలన్నారు. 551 జీవో ప్రకారం గుర్తింపు కార్డులు, కనీస వేతనాలు, పిఎఫ్, ఇఎస్ఐ అమలు చేయాలని పంచాయతీ కార్మికులకు గ్రీన్ అంబాసిడర్‌కు బకాయి జీతాలు చెల్లించాలన్నారు. గ్రీన్ అంబాసిడర్ బకాయిల చెల్లింపునకు చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. సమావేశంలో ఎన్ గురువులు, పి.సిమ్మయ్య, ఎన్.సంగమేశు , బి రవి, ప్రసాదు, బి.అప్పడు, బి.కూర్మారావు, లక్ష్మణరావు తదితరులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న రిలే దీక్షలు

పాలకొండ : పాలకొండను జిల్లా చేయాలని, లేదా పాత పాలకొండ రెవెన్యూ డివిజన్‌ను శ్రీకాకుళంలో కలపాలని కోరుతూ చేపట్టిన రిలేనిరాహార దీక్షలు శనివారం కూడా కొనసాగాయి. ఈ నిరసన దీక్షలను ఉద్దేశించి మాజీ జెడ్పిటిసి సభ్యులు సామంతులు దామోదర్‌రావు, ఎ.రామకృష్ణ మాట్లాడారు కార్యక్రమంలో చౌదరి నాయుడు, బి.అప్పలనాయుడు, సుబ్బా నానాజీ తదితరులు ఉన్నారు.

అధికారుల హామీతో నిరాహార దీక్ష వాయిదా

ప్రజాశక్తి - కొమరాడ

పంచాయతీల నిధులు దుర్వినియోగంపై పది రోజుల్లో విచారణ జరిపి నివేదికలు ఇస్తామని అధికారులు తెలపడంతో ఈనెల 3 నుంచి తలపెట్టిన నిరాహార దీక్షను వాయిదా వేసినట్లు సిపిఎం నాయకులు కొల్లి సాంబమూర్తి తెలిపారు. శనివారం స్థానిక ఎంపిడిఒ మల్లికార్జున రావును కలిసి నిధుల దుర్వినియోగంపై ఫిర్యాదారులు, సాంబమూర్తి మాట్లాడారు. కొమరాడ పంచాయతీకి సంబంధించి నిధులపై దుర్వినియోగంపై జరిపిన దర్యాప్తు నివేదిక నెలల గడుస్తున్నా బయటకు తెలియజేయకుండా తన వద్ద ఉంచుకున్న డిపిఒపై వెంటనే శాఖాపరమైన చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ విషయంపై స్పందించిన ఎస్ఐ కె.నీలకంఠ ఆధ్వర్యంలో ఎంపిడిఒ, ఇఒపిఆర్‌డి రాధాకృష్ణ, ఎఒ రమేష్ ఈనెల 12 నాటికి దర్యాప్తు నివేదికను తెలియజేస్తామని వెల్లడించినట్లు తెలిపారు. ఏది ఏమైనా ఈనెల 12 లోపు దర్యాప్తు నివేదికను బయట పెట్టకపోతే భవిష్యత్తులో పెద్దఎత్తున ఆందోళన చేపడుతామని ఈ సందర్భంగా అధికారులకు తెలిపారు.

బురదమయమైన 'ప్రభుత్వ' ప్రాంగణం

తహశీల్దార్ కార్యాలయానికి వెళ్లేందుకు ప్రజలు అవస్థలు

ప్రజాశక్తి - సాలూరు

ప్రజలకు పాలన చేరువగా చేయాల్సిన ప్రభుత్వ కార్యాలయ ప్రాంగణమే ఇప్పుడు నరకకూపంగా మారింది. ఇందుకు స్థానిక తహసీల్దార్ కార్యాలయ ప్రాంగణమే ఉదాహరణ. ఈ కార్యాలయ ఆవరణ రోడ్డు వర్షం పడితే బురదమయమై, పెద్దపెద్ద గుంతలతో నిండిపోయాయి. దీంతో ప్రజలు లోపలికి అడుగు పెట్టలేని దయనీయమైన పరిస్థితులు. ఈ ప్రాంగణంలో కేవలం తహశీల్దార్ కార్యాలయమే కాకుండా, జిసిసి గోడౌన్, ట్రెజరీ ఆఫీస్, రిజిస్ట్రార్ ఆఫీస్ వంటి అత్యంత కీలకమైన కార్యాలయాలు కూడా ఉన్నాయి. దీంతో ఈ ప్రాంగణానికి పట్టణంతో పాటు మక్కువ, పాచిపెంట మండలాల నుంచి ప్రతిరోజూ వేలాది మంది ప్రజలు, రైతులు, ఉద్యోగులు, వ్యాపారులు వివిధ రకాల పనుల నిమిత్తం ఇక్కడికి వస్తుంటారు. వారి వాహనాలు గుంతల్లో కూరుకుపోవడం, పాదచారులు బురదలో నడవలేక వృద్ధులు, మహిళలు, వికలాంగులు నానా అవస్థపడుతున్నారు. ఈ కార్యాలయాలు ప్రభుత్వానికి, ప్రజలకు మధ్య వారధి వంటివి. అటువంటి చోట ఇలా రోడ్డు దెబ్బతినడం, పారిశుధ్యం లోపించడం స్థానిక పాలన పర్యవేక్షణ లోపాన్ని స్పష్టంగా తెలియజేస్తోంది. ఈ దారి గుండానే ప్రతి రోజు మండల ఉన్నతాధికారులు ప్రయాణాలు చేస్తున్నా ఏమీ చేయలేని పరిస్థితి. ఇప్పటికైనా జిల్లా ఉన్నతాధికారులు స్పందించి తక్షణమే ఈ ప్రభుత్వ కార్యాలయ ప్రాంగణం రోడ్డును వెంటనే శాశ్వత ప్రాతిపదికన బాగు చేయించాలని, గుంతలు పూడ్చి, కనీసం సిమెంటు లేదా బీటీ రోడ్డు వేయడానికి నిధులు మంజూరు చేయాలని స్థానికులు కోరుతున్నారు.



బురదమయమైన తహశీల్దార్ కార్యాలయ సముదాయానికి వెళ్లే రోడ్డు

ఓపెన్ స్కూల్ అడ్మిషన్ ఫీజుకు గడువు పెంపు

ప్రజాశక్తి - పార్వతీపురం

ఆంధ్రప్రదేశ్ సార్వత్రిక విద్యాపీఠం (ఓపెన్ స్కూల్)లో చేరడానికి దరఖాస్తులు సమర్పించడానికి రిజిస్ట్రేషన్ ప్రక్రియ అక్టోబర్ 31తో ముగిసిందని డిఇఒ బి.రాజ్ కుమార్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. అక్టోబర్ 31లోగా రిజిస్ట్రేషన్ చేసుకున్న విద్యార్థులు ఈనెల 8లోగా అడ్మిషన్ ఫీజు చెల్లించడానికి ప్రభుత్వం అనుమతి ఇచ్చిందన్నారు. ఎస్ఎస్‌సిలో పాత సిలబస్ ఉత్తీర్ణత సాధించకపోయిన అభ్యర్థులకు కూడా అడ్మిషన్ ఈనెల 8 వరకూ పొడిగించామని, అభ్యర్థులు గమనించాలని ఆయన ఆ ప్రకటనలో కోరారు.

7 నాటికి ఇకెవైసి పూర్తి చేయాలి

ప్రజాశక్తి - వీరఘట్టం

మండలంలోని ఉపాధి హామీ చట్టం కింద పనులు చేస్తున్న వేతనదారులకు ఈనెల 7న నాటికి శత శాతం ఇకెవైసి పూర్తి చేయాలని ఎపిఒ జి.సత్యంనాయుడు ఫీల్డ్ అసిస్టెంట్లకు సూచించారు. శనివారం స్థానిక ఉపాధిహామీ కార్యాలయంలో ఫీల్డ్ సహాయకుల సమావేశంలో ఆయన మాట్లాడారు. మండలంలోని 24,915 మంది జాబ్ కార్డు దారులు ఉన్నారని, ఇంతవరకు 20,521 మందికి ఇకెవైసి చేశామని తెలిపారు. ఇంకా 4394 మందికి ఇకెవైసి చేయాల్సి ఉందన్నారు. మిగిలిన కూడా పూర్తి చేసేందుకు బాధ్యత వహించాలని ఫీల్డ్ సహాయకులను ఆదేశించారు. కార్యక్రమంలో ఇంజనీరింగ్ కన్సల్టింగ్ కృష్ణ ప్రసాద్, టెక్నికల్ సహాయకులు, ఫీల్డ్ సహాయకులు పాల్గొన్నారు.

కనికరమూ కరువే



ప్రజాశక్తి - విజయనగరం ప్రతినిధి

ఔను...! పార్వతీపురం మన్యం జిల్లాలో గిరిజన విద్యార్థుల మరణాలు, వారుపడుతున్న కష్టాలపై ఇదే జిల్లాకు చెందిన రాష్ట్ర గిరిజన సంక్షేమ శాఖ మంత్రి గుమ్మిడి సంధ్యారాణి నుంచి కనికరం కూడా కరువైంది. కురుపాం గిరిజన ఆశ్రమ పాఠశాలకు చెందిన ఇద్దరు విద్యార్థినులు మరణించి సుమారు నెల రోజులు కావచ్చింది. ఇటీవలే సీతంపేట ప్రాంతంలో మరో విద్యార్థిని మృత్యువాత పడింది. గిరిజనులు పెద్దపెట్టున రోధిస్తూ మృతదేహంతోనే ఆందోళన చేపట్టారు. అంతకు ముందు కూడా మరికొందరు విద్యార్థులు చనిపోయారు. టిడిపి అధికారంలోకి వచ్చాక మొత్తంగా 17మంది గిరిజన విద్యార్థులు మరణించినట్టు లెక్కలు వినిపిస్తున్నాయి. ఈ నేపథ్యంలో ఇటీవల మరణించిన విద్యార్థినుల కుటుంబ సభ్యులను ఓదార్చడం వంటి చర్యలకు అమాత్యులవారికి తీరిక లేకపోయింది. చివరికి వైసిపి తరపున ఆ పార్టీకి చెందిన నాయకులు బాధిత కుటుంబీలకు రూ.5లక్షలు చొప్పున పరిహారం ఇచ్చినా కదలిక రాకపోవడంతో విద్యార్థుల సంక్షేమం పట్ల ఆమెకు గానీ, ప్రభుత్వానికిగానీ ఉన్న చిత్తశుద్ధి ఏపాటిదో అర్థం చేసుకోవచ్చు. మృత్యుఘంటికలకు బాధ్యత వహించాల్సిన 'మంత్రి జ్వరాలొస్తే మంత్రిది బాధ్యతా' అంటూ ఈనెల 22 మెంటాడలో ఆడిన బుకాయింపు మాటలకు గిరిజనులు విస్తుపోతున్నారు. మా ఓట్లుతో గెలిచి, మమ్మల్ని నిర్లక్ష్యం చేయడమే కాకుండా చిన్నచూపు చూస్తున్నారనే చర్చ గిరిజనుల్లో సర్వత్రా వ్యక్తమౌతోంది. కనీసం చనిపోయిన విద్యార్థుల కుటుంబీలకును కూడా కలవలేదని జిల్లా వ్యాప్తంగా పబ్లిక్ టాక్. వాస్తవానికి మన్యం జిల్లాలోని గిరిజన వసతి గృహాలతో పాటు ఇతర వసతి గృహాల్లోనూ విద్యార్థులు తీవ్ర అవస్థలు పడుతున్నారు. చాలా వరకు హాస్టళ్లు శిథిలాల నడుమ నడుస్తున్నాయి. గడిచిన తుపాను మూడు రోజుల పాటు బిక్కుబిక్కుమంటూ కాలం గడిపారు. దాదాపు అన్నిచోట్లా విద్యార్థులు జ్వరాలు, ఇతర అనారోగ్య సమస్యలతో సతమతమౌతున్నారు. ఇటువంటి సమయంలో ఆయా హాస్టళ్లను సందర్శిస్తే విద్యార్థులకు ఓ ధైర్యం, వారి తల్లిదండ్రులకు ఓ మానసిక నిబ్బరం. కానీ, అందుకు తగ్గట్టుగా మంత్రిగానీ, అధికార యంత్రాంగంగానీ గిరిజనుల్లో నమ్మకం కలిగించలేకపోయారు. కురుపాం గిరిజన ఆశ్రమ పాఠశాలలో 609మంది విద్యార్థినులు చదువుతున్నారు. ఇద్దరి విద్యార్థినుల మరణం, వందలాది మంది ఆసుపత్రి పాలవ్వడంతో ఈ వసతి గృహానికి గతనెల 4 నుంచి 15వ తేదీ వరకు సెలవులు ప్రకటించిన సంగతి తెలిసిందే. అనంతరం పాఠశాల ప్రారంభించి నేటికి 15రోజులు గడుస్తున్నా ఇప్పటికీ కేవలం 200 మంది విద్యార్థినులు మాత్రమే వచ్చారు. ఇదన్నమాట విద్యార్థులు, వారి తల్లిదండ్రుల్లో మంత్రి సంధ్యారాణి కల్పించిన మనోధైర్యం. ఇంతకన్నా దారుణం ఉంటుందా? అంటూ పలువురు ముక్కున వేళ్లేసుకుంటున్నారు. వసతి గృహం తెరిచినపుటికీ, మంత్రి, స్థానిక ఎమ్మెల్యే తీరును బట్టి ధైర్యంగా పిల్లల్ని పంపలేకపోతున్నామని తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. జ్వరాలకే బాధ్యత వహించలేని మంత్రి, తమ పిల్లల ప్రాణాలకు ఇంకెక్కడ భరోసా ఇస్తారని వారంతా ప్రశ్నిస్తున్నారు. ఇదే పరిస్థితి కొనసాగితే ఇక్కడి ముక్కపచ్చలారని ఆ చిన్నారుల చదువు ఏం కావాలి? దీనిపై గిరిజన సంక్షేమ శాఖ ఇసుమంత కూడా ఆలోచించలేదేమో. 'పోతే పోనీ అన్నట్టుగా వ్యవహరిస్తున్నారు' అంటూ మంత్రి తీరుపై విమర్శలు వినిపిస్తున్నాయి. అందుకు తగ్గట్టే సమస్యకు పరిష్కారం చూపాల్సిన సంధ్యారాణి తప్పించుకు తిరుగువాడు ధన్యుడు సుమతీ అన్నట్టుగా వ్యవహరిస్తున్నారు.



పుట్టజమ్ములో ప్రచారం చేస్తున్న పుష్పశ్రీవాణి

పిపిపితో విద్యార్థులకు తీవ్ర నష్టం : పుష్పశ్రీవాణి

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం

ప్రభుత్వ మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా మండలంలోని చెముడు గూడ పంచాయతీ పుట్టజమ్ములో వైసిపి నాయకులు కోటి సంతకాల సేకరణ కార్యక్రమాన్ని శనివారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మాజీ డిప్యూటీ సిఎం పాముల పుష్పశ్రీవాణి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. వైద్యవిద్యను కూటమి పిపిపి విధానం ద్వారా ప్రైవేట్ వ్యక్తులకు అప్పగించే పనిలో ఉందని ఆరోపించారు. ఇదే జరిగితే వైద్యవిద్య పేదలకు భారంగా మారుతుందన్నారు. ఉన్నత విద్య చదవడానికి నానా ఇబ్బందులు పడుతున్న గిరిజన విద్యార్థులకు పిపిపి విధానం తీసుకువస్తే విద్యార్థులు వైద్య విద్యకు దూరమవుతారని ఆందోళన వ్యక్తం చేశారు. కావున దీన్ని వ్యతిరేకిస్తూ వైసిపి కోటి సంతకాల సేకరణ ప్రజా ఉద్యమం నిర్వహించిందని ఆమె తెలిపారు. ఎంపిపి కె.దీనమయ్య, జెడ్‌పిటిసి రాధిక, సర్పంచులు, ఎంపిటిసిలు, నాయకులు, కార్యకర్తలు ఉన్నారు.

నేడు మండల స్థాయి గణిత ప్రతిభా పరీక్ష

ప్రజాశక్తి - వీరఘట్టం

స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల(బాలుర) ఆవరణలో సిక్కోలు గణితం సంఘం ఆధ్వర్యంలో ఆదివారం మండల స్థాయి గణిత ప్రతిభ పరీక్ష నిర్వహించనున్నట్లు నిర్వాహకులు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. 8, 9, 10 తరగతుల విద్యార్థులు మాత్రమే పరీక్షకు హాజరుకావాలని పిలుపునిచ్చారు. ఉదయం 9 నుంచి పరీక్ష ఉంటుందని అంశాన్ని గ్రహించగలరు.



ప్లాస్టిక్‌పై అవగాహన కల్పిస్తున్న ఇన్‌ఛార్జి ఎంపిడిఒ రమేష్

ప్లాస్టిక్ రీసైక్లింగ్‌కు సహకరించాలి

ప్రజాశక్తి - కురుపాం

ప్లాస్టిక్ రీసైక్లింగ్ ప్రోసెస్‌కు ప్రతి ఒక్కరూ సహకరించాలని డిప్యూటీ ఎంపిడిఒ జి.రమేష్ బాబు ప్రజలను సూచించారు. శనివారం కురుపాంలో ప్లాస్టిక్ రీసైక్లింగ్‌పై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ షాపులు, ఇళ్ల నుంచి వచ్చే వ్యర్థాలను వేర్వేరు సంచుల్లో వేసి పిడబ్ల్యుఎం యూనిట్‌కు తరలించేందుకు సహకరించాలని కోరారు. అలాంటప్పుడే ప్లాస్టిక్ రీసైక్లింగ్ ప్రోసెస్‌కు సహకరించినట్లు అవుతుందన్నారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

మేధా దక్షిణామూర్తి పీఠంలో బ్రహ్మోత్సవాలు

ప్రజాశక్తి - పార్వతీపురంటౌన్

మేధా దక్షిణామూర్తి పీఠం జిల్లాకే గర్వకారణమని స్థానిక ఎమ్మెల్యే బోనెల విజయచంద్ర అన్నారు. శనివారం మురపాక కాశీ దాసు స్వామి ఆధ్వర్యంలో సర్వమంగళ పీఠంలో జరుగుతున్న శ్రీ మేధా దక్షిణామూర్తి బ్రహ్మోత్సవాల కార్యక్రమంలో ఎమ్మెల్యే మాట్లాడారు. దక్షిణామూర్తి అనుగ్రహంతో జిల్లాలోని ప్రజలు మేధాసంపత్తులై విజ్ఞానంతో వ్యవహరించి జీవితాలను సుసంపన్నం చేసుకోవాలని కోరారు. ముందుగా ఆలయ నిర్వాహకులు కాశిదాసు స్వామి వైదిక ఆచారాల ప్రకారం స్వాగతం పలికి ఆహ్వానించారు. అనంతరం జరిగిన ప్రత్యేక పూజ కార్యక్రమాల్లో ఎమ్మెల్యే పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు, అభిమానులు పాల్గొన్నారు.

అనారోగ్యంతో ఎస్ఐ మృతి

ప్రజాశక్తి - సీతంపేట

మండలంలోని జిల్లేడుపాడుకు చెందిన ఆరిక సింహాచలం (58) అనారోగ్యంతో శనివారం రాత్రి మృతి చెందారు. ఈయన శ్రీకాకుళం జిల్లా ఆమదాలవలస పోలీస్ స్టేషన్ ఎస్ఐగా విధులు నిర్వహిస్తున్నారు గత కొంత కాలంగా అనారోగ్యంతో బాధపడుతూ శ్రీకాకుళం ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. ఆయన మృతి పట్ల పోలీసు సిబ్బంది సంతాపం తెలిపారు.

భాష్యం విద్యాసంస్థల గుర్తింపును రద్దు చేయాలి : ఎఐఎస్ఎఫ్

ప్రజాశక్తి - సాలూరు

విద్యా సంవత్సరం ప్రారంభం కాక ముందే ముందస్తు అడ్మిషన్లు చేపడుతున్న భాష్యం విద్యాసంస్థల యాజమాన్యంపై తక్షణ చర్యలు తీసుకోవాలని ఎఐఎస్ఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి బి. రవి కుమార్ డిమాండ్ చేశారు. శనివారం ఆయన సాలూరు భాష్యం స్కూల్ ను సందర్శించారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ సోషల్ మీడియాలో స్కూల్ యాజమాన్యం చేస్తున్న ప్రచారాన్ని కూడా ఖండిస్తున్నామన్నారు. ప్రభుత్వం నిర్దేశించిన విద్యా నిబంధనలను, ఫీజు నియంత్రణ మార్గదర్శకాలను భాష్యం సంస్థలు ఉల్లంఘిస్తున్నాయని, విద్యార్థులు, తల్లిదండ్రులపై అనవసరంగా ఒత్తిడి తెస్తూ, ముందస్తు అడ్మిషన్ల పేరుతో అధిక ఫీజులు వసూలు చేస్తున్నారని ఆరోపించారు. అడ్మిషన్ పేరుతో ఫీజులు దోపిడీకి పాల్పడితే కఠిన చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఎఎస్ఎఫ్ఐ నాయకులు పాల్గొన్నారు.

సూర్యపీఠంలో సామూహిక సత్యనారాయణస్వామి వ్రతాలు

ప్రజాశక్తి - పార్వతీపురం టౌన్



పూజలు చేస్తున్న పురోషితులు

పట్టణ శివారులో గల శ్రీసూర్య పీఠంలో శనివారం అయ్యప్ప సన్నిధానంలో అయ్యప్ప స్వాములు శ్రీదేవి, భూదేవి సమేత శ్రీ కళ్యాణ వెంకటేశ్వర స్వామి వారి ఉత్సవమూర్తులను బాల భాస్కర రుషివాటికలో వేంచేంపజేసి సత్యనారాయణ స్వామి వ్రతాలు ఆచరించారు. సూర్యపీఠం ఆదిత్య పంచాయతనంలో రమాసత్యనారాయణ స్వామి ప్రీతికరంగా సామూహిక సత్యనారాయణ స్వామి వ్రతాలు కార్తీక శుద్ధ ఏకాదశి పర్వదిన సందర్భంగా అశేషశేముషీనిధి బ్రహ్మ శ్రీ నరహరి శాస్త్రి అధ్వర్యంలో జరిగాయి. కార్యక్రమంలో వి.వివేకానంద శర్మ, టిఆర్‌కెశర్మ, తదితరులు పాల్గొన్నారు.

పేదలకు దుస్తులు పంపిణీ

ప్రజాశక్తి - మక్కువ

కార్తీక మాసంలో వచ్చే ఏకాదశిని పురస్కరించుకొని మండలంలోని వెంకటభైరిపురం అయ్యప్పస్వామి ఆలయ ప్రాంగణంలో 400 మంది మహిళలకు చీరలను ఎమ్మెస్సార్ ఫౌండేషన్ వ్యవస్థాపకులు శ్రీనివాసరావు ఆధ్వర్యంలో శనివారం అందజేశారు. స్థానిక సర్పంచ్ మరడ వెంకటరత్నం చేతుల మీదుగా మహిళలకు చీరలను అందజేశారు. అలాగే 108 మంది దంపతులతో సామూహిక సత్యనారాయణ స్వామి వ్రతాలను జరిపించారు ఈ సందర్భంగా చేపట్టిన మహా అన్నదాన కార్యక్రమానికి సుమారు 2వేలమంది పాల్గొన్నారు. కార్యక్రమంలో గురుస్వామి మరడ నారాయణరావు, సుమారు 40మంది అయ్యప్ప స్వాములు, చుట్టుపక్క గ్రామాల ప్రజలు పాల్గొన్నారు.



పేద మహిళలకు చీరలు పంపిణీ చేస్తున్న శ్రీనివాసరావు, వెంకటరత్నం

పేదల సంక్షేమానికి పనిచేస్తున్నాం : మంత్రి

ప్రజాశక్తి - సాలూరు

ప్రభుత్వం పేద ప్రజల సంక్షేమం కోసం ప్రతి స్థాయిలో కట్టుబడి పనిచేస్తోందని రాష్ట్ర గిరిజన, స్త్రీ, శిశు సంక్షేమశాఖా మంత్రి గుమ్మిడి సంధ్యారాణి తెలిపారు. పట్టణంలోని 17వ వార్డు వెలమపేటలో అర్హులైన లబ్ధిదారులకు ఎన్టీఆర్ పెన్షన్లను శనివారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ పార్టీలకు అతీతంగా, అర్హులైన ప్రతి ఒక్కరికీ పెన్షన్ అందించడమే కూటమి ప్రభుత్వ ధ్యేయమన్నారు. ఎవరికీ అన్యాయం జరగకుండా ప్రతి అర్హుడి తలుపు వద్దకు సంక్షేమం తీసుకువెళ్లడానికి ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ టిటి రత్నకుమార్, పట్టణ టిడిపి అధ్యక్షులు నిమ్మాది తిరుపతిరావు, పలువురు నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

పార్వతీపురంటౌన్ : ఎన్.టి.ఆర్ భరోసా పింఛన్లను జిల్లా కలెక్టర్ డా. ఎన్.ప్రభాకర రెడ్డి, ఎమ్మెల్యే బోనెల విజయచంద్రతో కలిసి మండలంలోని చినమరికిలో పంపిణీ చేశారు. ఇంటింటికీ వెళ్లి లబ్ధిదారులకు పింఛన్లు అందించారు. పింఛను పంపిణీ కేవలం సంక్షేమం మాత్రమే కాదని, ప్రజల పట్ల ప్రభుత్వానికి ఉన్న బాధ్యతని తెలిపారు. అనంతరం ప్రజలతో మమేకమై వారి కష్టసుఖాలను, స్పందనను కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో డిఆర్‌డిఎ పీడీ ఎం.సుధారాణి, ఇతర ప్రజాప్రతినిధులు, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

కురుపాం : మండలంలోని బియ్యాలవలసలో ఎన్టీఆర్ భరోసా పెన్షన్లు పంపిణీ కార్యక్రమంలో స్థానిక ఎమ్మెల్యే తోయక జగదీశ్వరి పాల్గొన్నారు. ఇంటింటికి వెళ్లి పెన్షన్ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అధికారులతో పాటు ప్రజాప్రతినిధులను కూడా ప్రజలు వద్దకు వెళ్లి సమస్యలు తెలుసుకునేలా కూటమి ప్రభుత్వ నిర్ణయం చాలా గొప్పదని అన్నారు. కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ పి.అజ్జారి, ఎంపిడిఒ ఉమామహేశ్వరి, పంచాయతీ కార్యదర్శి వై.వెంకట నాయుడు, ఎఎంసి చైర్‌పర్సన్ కడక కళావతి, రాష్ట్ర ట్రైకార్ బోర్డ్ డైరెక్టర్ పువ్వల లావణ్య, మండల కన్వీనర్ కెవి కొండయ్య, ఎఎంసి మాజీ చైర్మన్ కోలా రంజిత్ కుమార్, బిజెపి సీనియర్ నాయకులు ఎన్. ధుళికేశ్వరరావు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.



సాలూరులో పింఛన్లు పంపిణీ చేస్తున్న మంత్రి సంధ్యారాణి



పింఛను పంపిణీ చేస్తున్న కలెక్టర్ ప్రభాకరరెడ్డి, ఎమ్మెల్యేవిజయచంద్ర



పింఛన్లు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే జగదీశ్వరి

ఆర్ఐఎంఎస్ పునరుద్ధరణపై హర్షం

ప్రజాశక్తి - పాలకొండ

ఆర్టీసిలో విలీనానంతరం నిలిపివేయబడిన రిటైర్డ్ ఎంప్లాయీస్ మెడికల్ స్కీమ్ (ఆర్ఎంఎస్) అమలుకు ప్రభుత్వం ఆదేశాలు జారీ చేయడంతో ఎపిపిటిడి (ఆర్టీసి) ఎంప్లాయీస్ యూనియన్ (ఇ.యు) రాష్ట్రకమిటీ, విజయనగరం జోనల్, జిల్లా కమిటీలు హర్షం వ్యక్తం చేస్తున్నట్టు యూనియన్ రాష్ట్ర డిప్యూటీ జనరల్ సెక్రెటరీ పి.భానుమూర్తి, జోనల్ అధ్యక్షులు కె.శ్రీనివాసరావు, కార్యదర్శి బాసూరి కృష్ణమూర్తి, జిల్లా కార్యదర్శి జి.రవికాంత్ శనివారం ఒక ప్రకటన ద్వారా తెలిపారు. 2020కి ముందు పనిచేసి రిటైర్ అయిన ఉద్యోగులు రిటైర్మెంట్ సమయంలో రూ.25వేలు, ఆపై సూపర్ వైజర్లు, అధికార్లు రూ.27వేలు చెల్లించి సభ్యులైన వారికి జీవితకాల వైద్య సదుపాయాలు, రిఫరల్ ఆసుపత్రుల ద్వారా భార్యాభర్తలకు రూ.4 లక్షల వరకూ వైద్య సాయమందించే ఈ పథకం, ఆర్టీసి విలీనానంతరం నిలిపివేయ బడిందని తెలిపారు. ఇందుకు గనుఉ ఎంప్లాయీస్ యూనియన్ తరుపున ప్రభుత్వానికి, ఆర్టీసి మేనేజింగ్ డైరెక్టర్‌కు కృతజ్ఞతలు తెలిపారు.

11న ర్యాలీని జయప్రదం చేయండి : రాజన్నదొర

ప్రజాశక్తి -సాలూరు

ప్రైవేటు మెడికల్ కళాశాలలకు వ్యతిరేకంగా మండలంలోని మరుపల్లిలో మండల వైసిపి నాయకులతో 11న చేపట్టనున్న ర్యాలీని విజయవంతం చేయాలని మాజీ డిప్యూటీ సిఎం పీడిక రాజన్నదొర పిలుపునిచ్చారు. శనివారం రాజన్నదొర క్యాంప్ కార్యాలయంలో మండల వైసిపి నాయకులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ ఈ నెల 11న మండలంలో మరిపల్లిలో పార్టీ నాయకులతో కలిసి నిర్వహించే ర్యాలీని జయప్రదం చేయాలని, ఈ ర్యాలీకి మండలంలోని నాయకులు, కార్యకర్తలు అందరూ పాల్గొనాలని ఆయన పిలుపునిచ్చారు. అదేవిధంగా గ్రామ కమిటీని కూడా తొందరగా పూర్తి చేసి నియమించాలని ఆయన తెలిపారు. అలాగే కోటి సంతకాల సేకరణను కూడా ముగించేలా ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ఆయన కార్యకర్తలకు దిశానిర్దేశ చేశారు. కార్యక్రమంలో వైస్ ఎంపిపి రెడ్డి సురేష్, వైసిపి జిల్లా కార్యదర్శి దండి శ్రీనివాసరావు, ఎఎంసి మాజీ చైర్‌పర్సన్ దండి అనంతకుమారి, వైసిపి నాయకులు పెద్దింటి మాధవరావు, ఆదయ్య, సాంబమూర్తి, సుబ్బారావు, పరిమళ, జన్ని సీతారత్నం, వైసిపి నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ఎఎంసి చైర్మన్ గౌరి, పాలకవర్గ సభ్యులు

దళారులకు పంటలమ్మి మోసపోవద్దు

ప్రజాశక్తి - పార్వతీపురంటౌన్

రైతులు తమ పంటలను దళారులకు అమ్మి మోసపోవద్దని స్థానిక ఎఎంసి చైర్మన్ గొట్టాపు గౌరీ అన్నారు. శనివారం తన కార్యాలయంలో ఈ ఏడాది పంటలకు మద్దతు ధర గోడ పత్రికను విడుదల చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఖరీఫ్ సీజన్ ధాన్యం నూర్పులు ప్రారంభమైనందున తొందరపడి రైతులు ధాన్యాన్ని తరాలు దళారులకు అమ్మి మోసపోవద్దన్నారు. త్వరలోనే ప్రభుత్వం ఏర్పాటు చేయనున్న ధాన్యం కొనుగోలు కేంద్రాలకు తమ ఉత్పత్తులను తరలించాలన్నారు. కార్యక్రమంలో టిడిపి సీనియర్ నాయకులు గొట్టాపు వెంకటరమణ, తదితరులు పాల్గొన్నారు.

చెరువు గర్భంలో పొజిషన్ సర్టిఫికెట్

ప్రజాశక్తి - పాలకొండ

సామాన్యుడి ఇల్లు కట్టుకుంటానంటే ఇబ్బందులకు గురి చేసే అధికారులు అక్రమ నిర్మాణాలకు మాత్రం అండగా నిలుస్తున్నారు. పొజిషన్ సర్టిఫికెట్, విఎల్‌టిలు కోసం సామాన్యులు కార్యాలయాల చుట్టూ రోజుల తరబడి తిరుగుతున్నా పనులు జరగని పరిస్థితుల్లో కొంతమంది అక్రమార్కులు కాసు ఎరగా చూపి దర్జాగా అక్రమ నిర్మాణాలు చేపడుతున్న సంఘటనలు వెలుగులోకి వస్తున్నాయి. స్థానిక నగర పంచాయతీ పరిధిలోని నాగవంశపు వీధిలో 22ఎ లో ఉన్న పీతల బందులో అక్రమాలు కోకొల్లలు. 93 సెంట్లు ఉన్న పీతల బంద ఆక్రమణల పుణ్యమా అంటూ 8 సెంట్లుకు చేరింది. దర్జాగా ఎవరికి నచ్చినట్లు వారు నిర్మాణాలు చేసుకుంటున్నా అధికారులు మాత్రం ఏమీ పట్టనట్టు వ్యవహరిస్తున్నారు. దీన్ని ఆసరా చేసుకొని తాజాగా ఒక వ్యక్తి దర్జాగా పీతల బందులో ఇళ్ల నిర్మాణం చేపట్టడంతో అందరూ ముక్కున వేలేసుకుంటున్నారు. గతంలో పనిచేసిన తహశీల్దార్ బాలమురళీకృష్ణ ఆ వ్యక్తికి పొజిషన్ సర్టిఫికెట్ మంజూరు చేసినట్లు తెలుస్తుంది. దీంతో ఆగమేఘాల మీద నగర పంచాయతీ అధికారులు విఎల్‌టి కూడా వేసినట్లు సమాచారం. దీంతో ఆ వ్యక్తి దర్జాగా నిర్మాణాలు చేసుకుంటున్నారు. సుమారు 10 సెంట్లు స్థలం వరకు ఆక్రమించుకొని నిర్మాణం చేపడుతున్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. దీనిపై ఇప్పటికైనా అధికారులు దృష్టి పెట్టి చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

దర్జాగా చెరువులో నిర్మాణాలు



పీతలబందను చదును చేయిస్తున్న ఆక్రమణదారులు

చర్యలు తీసుకుంటాం

పీతలబందలో అక్రమ నిర్మాణం నా దృష్టికి వచ్చింది. దీనిపైన విఆర్ఒ కూడా పరిశీలించారు. చెరువు గర్భంలో నిర్మాణాలు చేపట్టడం నిబంధనలకు విరుద్ధం పూర్తి స్థాయిలో పరిశీలన చేసి దృష్టి పెడతాం.

- రాధాకృష్ణమూర్తి, తహశీల్దార్

జిల్లా స్థాయి పోటీలకు ముగ్గురు ఎంపిక

ప్రజాశక్తి - కురుపాం

స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల వద్ద విద్యార్థులకు శనివారం నిర్వహించిన నియోజకవర్గ స్థాయి వ్యాసరచన, వక్తృత్వ, క్విజ్ పోటీల్లో ప్రతిభ కనబర్చి ముగ్గురు విద్యార్థులు జిల్లా స్థాయికి ఎంపికైనట్లు ఎంఇఒ ఎన్.సత్యనారాయణ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నియోజవర్గంలో గల ఐదు మండలాల నుంచి 15 మంది విద్యార్థులు పోటీల్లో పాల్గొనగా గరుగుబిల్లి జడ్పీహెచ్ స్కూల్ విద్యార్థి దినేష్ కుమార్ ప్రథమ స్థానంలో నిలవగా, బిజెపురం విద్యార్థి లీలాగౌతం ద్వితీయ స్థానంలో నిలవగా, కురుపాం జిల్లా పరిషత్ పాఠశాల నుంచి సిహెచ్ నిహారిక తృతీయ స్థానం సాధించి జిల్లా స్థాయిలో ఎంపికయ్యారని తెలిపారు. వీరికి స్క్రీనింగ్ టెస్ట్ చేసి ఎంపికైన వారికి నవంబర్ 26న రాజ్యాంగ దినోత్సవం సందర్భంగా అసెంబ్లీలో సమావేశంలో పాల్గొనే అవకాశం కల్పిస్తారన్నారు. ఎంపికైన విద్యార్థులకు ఎంఇఒ అభినందనలు తెలిపారు.

పార్వతీపురం :మండలంలోని ములగ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థిని బంకపల్లి భార్గవి భారతరాజ్యాంగం దినోత్సవం సందర్భంగా, నిర్వహించిన మాక్ అసెంబ్లీ పోటీల్లో ప్రథమ స్థానం పొందింది. ఈ మేరకు ఆమె ఈనెల 26న భారత రాజ్యాంగదినోత్సవం సందర్భంగా ఆంధ్రప్రదేశ్ అసెంబ్లీలో జరుగు ఉత్సావాల్లో పాల్గొనటానికి అర్హత సాధించిందని ఆ పాఠశాల ప్రధానోపాధ్యాయులు పెంట రామకృష్ణ, ప్రతిభ చూపిన భార్గవిని పాఠశాల సిబ్బంది, తోటి విద్యార్థులు అభినందించారు.



ఎంపికైన విద్యార్థులను అభినందిస్తున్న ఉపాధ్యాయులు

పొట్టి శ్రీరాములుకు ఘన నివాళి

ప్రజాశక్తి - సాలూరు

ఆంధ్ర రాష్ట్ర అవతరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని గిరిజన, స్త్రీ, శిశుసంక్షేమశాఖా మంత్రి గుమ్మడి సంధ్యారాణి పట్టణంలోని మెయిన్ రోడ్‌లో గల అమరజీవి పొట్టి శ్రీరాములు విగ్రహానికి పూల మాలలు వేసి నివాళ్లు అర్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ తెలుగు ప్రజల ఆత్మగౌరవం, ప్రత్యేక ఆంధ్ర రాష్ట్రం ఏర్పాటు కోసం శ్రీరాములు చేసిన మహత్తర త్యాగాన్ని కొనియాడారు. ఆంధ్ర రాష్ట్ర సాధనకు ఆయన చేసిన ఆత్మ బలిదానం చిరస్మరణీయమన్నారు. ఒకే ఒక్కడి పోరాటం ఒక జాతి ఆకాంక్షను నెరవేర్చిందన్నారు. రాష్ట్ర సాధనలో పొట్టి శ్రీరాములు కృషిని, నిస్వార్థ సేవను ప్రతి ఒక్కరూ స్మరించుకోవాలని, ఆయన ఆశయాలను ముందుకు తీసుకెళ్లాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో స్థానిక నాయకులు, ప్రజా ప్రతినిధులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

రాజన్నదొర నివాళ్లు

మాజీ ఉపముఖ్యమంత్రి పీడిక రాజన్న దొర తన క్యాంప్ కార్యాలయంలో ఆంధ్ర రాష్ట్ర అవతరణ దినోత్సవం పురస్కరించుకొని పొట్టి శ్రీరాములు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళ్లు అర్పించారు. ప్రత్యేక ఆంధ్ర రాష్ట్ర సాధనకు తన ప్రాణాన్ని త్యాగం చేసిన మహోన్నత వ్యక్తి పొట్టి శ్రీరాములు అని, అటువంటి మహోన్నతుడుని మనమంతా స్మరించుకోవడం మన బాధ్యతని అన్నారు. ఆయన ఆశయాలను నెరవేర్చేలా ప్రతి ఒక్కరు కృషి చేయాలని పిలుపునిచ్చారు.



పట్టణంలో అంతర్జాతీయ రహదారిపై ఏర్పడ్డ పెద్దగొయ్యిలు

ప్రమాదం జరిగితే కానీ స్పందించరా?

ప్రజాశక్తి - పార్వతీపురం టౌన్

పట్టణ శివారులో ఉన్న అంతర్జాతీయ రహదారిపై ఏర్పడిన పెద్ద గుంతపై ప్రమాదం జరిగితేనే ఆర్ అండ్ బి అధికారులు స్పందిస్తారా ఆ రహదారిపై నుంచి ప్రయాణించే వాహన చోదకులు ఆర్ అండ్ బి అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. పట్టణ శివారులో ఉన్న స్మశానవాటిక దగ్గరలో ఉన్న అంతర్రాష్ట్ర రహదారిపై భారీ గుంత ఏర్పడి కొన్ని నెలలు దాటింది. దీనికి తోడు ఇటీవల కురిసిన వర్షాలకు వర్షం నీరు ఆ గుంటలో చేరడంతో అదే రహదారిపై రాకపోకలు సాగించే భారీ, ద్విచక్ర వాహనాలు, ఆటోలు ఏమాత్రం రహదారిపై ఉన్న నీరే అనుకొని ఏమరపాటుగా డ్రైవింగ్ చేస్తే ఆ గోతిలో పడి పెద్ద ప్రమాదం బారిన పడి ఆసుపత్రుల పాలయ్యే అవకాశం ఉంది. కావున అలాంటి ప్రమాదం జరగక ముందే ఈ రోడ్డుపై ఉన్న గుంతను కప్పేందుకు ఆర్ అండ్ బి అధికారులు యుద్ధ ప్రాతిపదికన చర్యలు చేపట్టి వాహనదారులను ప్రమాదాలబారిన పడకుండా చూడాలని స్థానికులు కోరుతున్నారు.

పాఠశాలల్లో ముస్తాబు కార్నర్

ప్రజాశక్తి - వీరఘట్టం

మండలంలోని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో శనివారం ఘనంగా ముస్తాబ్ కార్నర్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మండలంలోని సంత నర్సిపురం ప్రాథమిక మోడల్ పాఠశాలలో ప్రధానోపాధ్యాయులు వి.లక్ష్మునాయుడు ఆధ్వర్యంలో అద్దం, దువ్వెన, టవలు, సబ్బు, నెయిల్ కట్టర్, హ్యాండ్ వాష్, బకెట్, జగ్గు పాఠశాలలో ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.



పాఠశాలలో ఏర్పాటు చేస్తున్న ముస్తాబు సామగ్రి

విజృంభిస్తున్న డయేరియా

ప్రజాశక్తి-రామభద్రపురం

మండలంలో అతిసార విజృంభిస్తోంది. ఇటీవల బూసాయవలస, ముచ్చర్లవలస గ్రామాల్లో పలువురి దీని బారిన పడి ఇప్పుడిప్పుడే కోలుకుంటున్నారు. ఇంకా అక్కడ వైద్య శిబిరం కొనసాగిస్తున్నారు. తాజాగా శుక్రవారం నుంచి ఇట్లమామిడిపల్లిలో నలుగురు అతిసార బారిన పడి బాడంగి సిహెచ్‌సిలో చికిత్స పొందుతున్నారు. ఇక్కడ గొర్లె మంగ, గంట అప్పలనారాయణ, రాయిపల్లి అచ్చమ్మ, లెంక నారాయణ అతిసార బారిన పడ్డారు. దీనిపై సమాచారం తెలుసుకున్న జిల్లా పంచాయతీ అధికారి మల్లికార్జునరావు శనివారం గ్రామాన్ని సందర్శించారు. అతిసార వ్యాప్తికి గల కారణాలను అడిగి తెలుసుకున్నారు. మంచినీటి పథకాలను వెంటనే క్లోరినేషన్ చేయాలని, పారిశుధ్యం మెరుగుపరచాలని సూచించారు. అతిసారను అదుపు చేసేందుకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు.

అతిసార రోగులకు శంబంగి పరామర్శ

ఇట్లమామిడిపల్లి గ్రామ అతిసార రోగులను మాజీ ఎమ్మెల్యే శంబంగి వెంకట చినప్పలనాయుడు శనివారం బాడంగి ఆసుపత్రికి వెళ్లి పరామర్శించారు. అతిసార సోకడానికి గల కారణాలను అడిగి తెలుసుకున్నారు. అదుపునకు అన్ని చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఎంపిపి చొక్కాపు లక్ష్మణరావు, వైసిపి మండల నాయకుడు ఏకనాథ్ తదితరులు పాల్గొన్నారు.



తల నరికేయడంతో పడిఉన్న గోవింద మృతదేహం

మద్యం మత్తులో తండ్రి పీక కోసిన కసాయి

గొల్లాదిలో దారుణం

ప్రజాశక్తి-బాడంగి

మండలంలోని గొల్లాది గ్రామంలో దారుణ సంఘటన చోటుచేసుకుంది. మద్యం మత్తులో కన్న తండ్రి పీక కోసి హత్యచేశాడు కసాయి కొడుకు. ఈ సంఘటన శనివారం మండలంలో తీవ్ర కలకలం రేపింది. గ్రామస్తుల కథనం ప్రకారం.. గొల్లాది గ్రామానికి చెందిన మామిడి గోవింద (సత్యం) (62) పక్షవాతం వ్యాధితో మంచానికి పరిమితమయ్యాడు. గోవిందకు ఇద్దరు కుమారులున్నారు. గతంలోనే ఆయన భార్య మరణించింది. చిన్న కుమారుడు రాము శనివారం పదునైన కత్తితో గోవిందపై దాడి చేశాడు. పీక కోసి, శరీరం నుంచి తలను వేరు చేశాడు. దీంతో గ్రామస్తులు భయభ్రాంతులకు గురయ్యారు. హత్య ఎందుకు చేశాడో వివరాలు తెలియాల్సి ఉంది. రాము మద్యం తాగితే సైకోలా ప్రవర్తిస్తాడని గ్రామస్తులు చెబుతున్నారు. సంఘటనా స్థలానికి పోలీసులు చేరుకుని విచారణ చేస్తున్నారు.

ఆదర్శం.. ఎల్‌డిఎఫ్ ప్రభుత్వం

బొబ్బిలి : కేరళలో సిపిఎం నాయకత్వంలో వామపక్ష ప్రభుత్వం పేదరికం లేని రాష్ట్రంగా నిలిపి, దేశానికి, ప్రపంచానికి మంచి సందేశాన్ని ఇచ్చిందని ఆ పార్టీ జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు పి.శంకర్రావు అన్నారు. పేదరికం లేని రాష్ట్రంగా కేరళ ప్రభుత్వం ప్రకటించిన నేపథ్యంలో బొబ్బిలిలోని సిపిఎం కార్యాలయంలో ఆ పార్టీ ఆధ్వర్యాన కేక్ కట్ చేసి, సంబరాలు చేసుకున్నారు. కార్యక్రమంలో ఎపి రైతు సంఘం జిల్లా అధ్యక్షులు సింగిరెడ్డి గోపాలం, ఉడముల ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

జలపాతంలో పడి విద్యార్థి మృతి

ప్రజాశక్తి - పాచిపెంట

మండలంలోని ఆలూరుధారగెడ్డ సమీపాన గల జలపాతం వద్ద జారిపడి మిర్తివలసకు చెందిన విద్యార్థి కొండపల్లి హేమంత్ (18) శనివారం మృతి చెందాడు. స్నేహితులతో కలిసి సరదాగా ఆలూరుధారగెడ్డ జలపాతం వద్దకు వెళ్లారు. స్నేహితులతో కలిసి కేరింతలు పెడుతున్న సమీపంలో హేమంత్ జారిపడి కిందపడడంతో తల వెనుకభాగానికి గట్టిగా దెబ్బ తగిలింది. దీంతో అతడు అక్కడికక్కడే మృతి చెందాడు. దీంతో ఆ గ్రామంలో విషాద ఛాయలు అలముకున్నాయి. మిర్తివలసకు చెందిన కొండపల్లి గోవింద, పుష్పవతి దంపతుల ఆఖరు కుమారుడు. పాచిపెంటలో ఇంటర్ చదివిన అనంతరం సాలూరులో ఐటిఐ చదువుతున్నాడు. హేమంత్ మృతితో తల్లిదండ్రులు, బంధువులు, తోటి స్నేహితుడు, కన్నీరుమున్నీరై రోధిస్తున్నారు.



మృతి చెందిన హేమంత్

వంశధారలో మహిళ గల్లంతు

ప్రజాశక్తి -భామిని

మండలంలోని కాట్రగడ్డ-బి గ్రామంలో గౌడ జడ్డి(65) అనే మహిళ శనివారం ఉదయం వేకువజామున వంశధారనదిలో గల్లంతయింది. కుటుంబ సభ్యులు తెలిపిన సమాచారం మేరకు గౌడు జడ్డి అనే మహిళ శనివారం ఉదయం వేకుజామున కార్తీక మాసం కావడంతో రోజు వారిలాగే స్నానానికి వెళ్లింది. స్నానం చేసే క్రమంలో జారిపడి నదిలో కొట్టుకుపోయింది. నీటి ప్రవాహం అధికంగా ఉండడంతో వేగంగా కొట్టుకుపోయింది. విషయం తెలుసుకున్న తహశీల్దార్ శివన్నారాయణ, బత్తిలి ఎస్ఐ అప్పారావు సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. స్థానిక ఈతగాళ్లతో గాలింపు చేపట్టారు. మృత దేహం లభ్యం కాలేదని రెవెన్యూ అధికారులు తెలిపారు. ఉన్నత అధికారులకు సమాచారం అందజేశామని, ఆదివారం ఎస్‌డిఆర్‌ఎఫ్ బృందాలచే మళ్లీ గాలింపు చర్యలు చేపడతామని తెలిపారు.



గల్లంతైన జడ్డి